# ఐదో నెంబర్ సీటు

-కె.బి.కృష్ణ



జనాభా విపరీతంగా పెరిగిపోవడంతో విమానాలు, రైళ్ళు, బస్సులు, లారీలు, ఆటోలు..ఏవీ కూడా జనం ప్రయాణాలకు సరిపోవడం లేదు. ఎటు చూసినా రద్దీ. విశాఖపట్నం నుంచి కాకినాడ నాన్‌స్టాప్ బస్ ఎక్కుదామని బస్టాండ్‌కి వచ్చాను. జనంతో చాలా రద్దీగా ఉంది.

ప్రతి మనిషీ చాలా వేగంగా ఒకరిని దాటి మరొకరు, ఒకరిని త్రోసుకుని మరొకరు వెళ్లిపోతున్నారు. ఇంతమందికి అంత అర్జెంట్ పనులు ఏముంటాయి? ఒకవేళ సర్వే చేస్తే పనిలేకుండా తిరిగే వాళ్ళుంటారా అనిపించింది.

కొంచెంసేపటికి జీన్స్ ప్యాంట్, షర్ట్ వేసుకుని భుజాన్న ఒక పెద్ద బ్యాగ్ తగిలించుకుని ఒక యువకుడు వచ్చాడు. అతను నన్ను చూస్తూనే విసుగ్గా.

“ఈ సీటు నాది. కావాలని విండోసీటు రిజర్వ్ చేయించుకున్నాను. ఖాళీ చేయండి” అన్నాడు, ఆ సీటేదో అతను స్వంతంగా కొనేసుకున్నట్లుగా.

“బాబూ నా సీటు కూడా విండో సీటే. డ్రైవర్ వెనుక నాకు విండో సీటు ఉంది. అందులో కూర్చోకూడదూ..” అన్నాన్నేను.

“సారీ. నాకు ఈ సీటే కావాలి” అన్నాడు కోపంగా, కరకుగా.

వెంటనే నేను లేచి డ్రైవర్ వెనకాల మూడో వరుసలో విండో సీటులో కూర్చున్నాను. బస్సు అనకాపల్లి దాటుతోంది.

మా బస్సుకి ముందు ఫుల్‌లోడ్‌తో ట్రైలర్ వెళ్తోంది. బస్ డ్రైవర్ సైడు ఇవ్వమని ట్రైలర్‌వాడిని హారన్‌తో మోదుతున్నాడు. నా లారీ ముందుకెళ్లాలని లారీ వాడూ, నా బస్ నాన్‌స్టాప్ కాబట్టి నేను ముందు కెళ్లాలని బస్సు వాడూ ఇద్దరూ పోటీపడుతున్నారు.

దాంతో మా బస్ డ్రైవర్‌కి కోపం వచ్చేసింది. కొంచెం సందు ఉంటే ట్రైలర్‌కి ప్రక్కన దూరి లోపలకు వెళ్లాడు. ట్రైలర్ డ్రైవర్ పక్కకు జరిగినట్టే జరిగి సడెన్‌గా బస్‌ని రాసుకున్నాడు. పెద్ద శబ్దం అయింది. ఏం జరిగిందో తెలియదు....

★ ★ ★

హాస్పిటల్‌లో కళ్ళు తెరిచేటప్పటికి ఆతృతగా నిలబడి ఉన్నారందరూ.

“కళ్ళు తెరిచారండీయన. షాక్‌తో పాపం స్పృహ కోల్పోయారు” అంటున్నారు డాక్టర్‌గారు.

నీరసంతో మాటలు పెగలడంలేదు. ఎలాగో నోరు తెరిచి బలవంతంగా “ఐదో నెంబర్ సీటులో ఉన్న...” అన్న నా మాటలు పూర్తికాకుండానే “ఆయన మీ బంధువా? సారీ..చాలా గాయాలయ్యాయి. ప్రమాదపరిస్థితుల్లో ఉన్నారు” అన్నాడు నా ప్రక్కసీటులో నిలబడి ఉన్న వ్యక్తి.

“అటు ప్రక్కన కూర్చున్న వాళ్లందరూ తీవ్రంగా గాయపడ్డారు” అన్నారెవరో.

ఆ సీటే కావాలని ఆ యువకుడు నన్ను కాపాడాడా లేక తన ప్రాణం మీదకు తెచ్చుకున్నాడా?

ఏమో-

నా మనసంతా ఆందోళనతో, బాధతో నిండిపోయింది.

★